## ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే అరెస్టులా?

- ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి అక్రమ అరెస్టుపై బీఆర్ఎస్ నాయకుల మండిపాటు

హుజూరాబాద్ టౌన్/ జమ్మికుంట/ సైదాపూర్/ వీణవంక, జూన్ 21: ఎన్నికల హామీల అమలు, ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేయించడమేంటని బీఆర్ఎస్ నాయకులు నిలదీశారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని శంషాబాద్‌లో వరంగల్ సుబేదారి పోలీసులు అరెస్టు చేయడాన్ని డివిజన్ వ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఇది ప్రభుత్వ కక్ష సాధింపు చర్య అని మండిపడ్డారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అక్రమ అరెస్టును బీఆర్ఎస్ హుజూరాబాద్ పట్టణాధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గందె రాధికాశ్రీనివాస్ ఖండించారు.

### అక్రమ అరెస్టులు మానుకొని హామీలు నెరవేర్చాలి

అక్రమ కేసులు, అరెస్టులపై ఉద్యమిస్తామని జమ్మికుంట మున్సిపల్ మాజీ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు హెచ్చరించారు. శనివారం ఆయన తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. అక్రమ కేసులు, అరెస్టులను మానుకొని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

### అక్రమ కేసులతో ఆత్మస్థైర్యాన్ని దెబ్బ తీయలేరు


మాట్లాడుతున్న శ్రావణ్

అక్రమ కేసులతో అరెస్టులు చేసి తమ నాయకుల స్థైర్యాన్ని దెబ్బ తీయలేరని కేటీఆర్ సేన హుస్నాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు రుద్రారపు శ్రావణ్ కుమార్ స్పష్టం చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ, అరెస్ట్ చేసిన ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని వెంటనే బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

### ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని వెంటనే విడుదల చేయాలి


మాట్లాడుతున్న బీఆర్ఎస్వీ నాయకులు రాపర్తి అఖిల్‌గౌడ్

ప్రజా సమస్యలను ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులు చేయడం సరికాదని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు రాపర్తి అఖిల్ గౌడ్ అన్నారు. శనివారం వీణవంకలో ఆయన మాట్లాడుతూ, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇక్కడ నాయకులు సిలివేరు విజయ్, తదితరులు ఉన్నారు.

### బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్

వీణవంక బీఆర్ఎస్ మండల నాయకులను పోలీసులు శనివారం ఉదయం ముందస్తు అరెస్ట్ చేశారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి మద్దతుగా ఏవైనా ఆందోళనలు చేపడతారేమోనని ముందస్తు చర్యగా బీఆర్ఎస్ నాయకులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తిరుపతి తెలిపారు. కాగా అరెస్ట్ అయిన వారిలో మాజీ సర్పంచులు పోతుల నర్సయ్య, మర్రి వరలక్ష్మి-స్వామి, నాయకులు కాసర్ల సుధాకర్, సంపత్‌రెడ్డి ఉన్నారు.


నగరంలో అల్ఫోర్స్‌లో విద్యార్థులతో కలిసి యోగాసనాలు వేస్తున్న నరేందర్ రెడ్డి


జిల్లా కేంద్రంలోని ఐఎంఏ హాల్‌లో యోగా సాధన చేస్తున్న వైద్యులు

# ఉత్సాహంగా యోగా డే

- జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు
- యోగాసనలు వేసిన ఔత్సాహికులు

నమస్తే నెట్‌వర్క్, జూన్ 21: జిల్లా వ్యాప్తంగా యోగా డే వేడుకలు శనివారం ఉత్సాహంగా జరుపుకొన్నారు. అన్ని మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాలయాలు, కార్యాలయాల ఆవరణతోపాటు, మైదానాల్లో ఔత్సాహికులు యోగా సాధన చేశారు. ఆయా చోట్ల ప్రముఖులు పాల్గొని యోగా ప్రాముఖ్యత వివరించారు. జిల్లా యువజన క్రీడా శాఖ, కరీంనగర్ జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని క్రీడా పాఠశాలలో యోగా డే వేడుకలు నిర్వహించారు. నగరంలో వికాస తరగిణి ప్రజ్ఞా వికాస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని జ్యోతిరావు పూలే మైదానంలో(సర్కస్ గౌడ్)లో త్రిదండి చిన్నజీయర్ స్వామి మంగళా శాసనాలతో దేవనాథ రామానుజ జీయర్ స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు జిల్లా కేంద్రంలోని వికాస తరంగిణి బాధ్యులు, పలు విద్యాసంస్థల విద్యార్థులు ట్రస్మా గౌరవాధ్యక్షుడు ప్రజ్ఞా వికాస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్ రావు హాజరయ్యారు. అలాగే, శాతవాహన యూనివర్సిటీలో, అల్ఫోర్స్ విద్యాసంస్థలు, పారమిత విద్యాసంస్థలు, మానేరు విద్యాసంస్థలు, ట్రినిటీ ది స్కూల్ ఆఫ్ లర్నింగ్, అద్విత, వివేకానంద, సిద్ధార్థ, కోరా జాన్సన్ గ్లోబల్ పాఠశాలల్లో, హనుమాన్ నగర్‌లోని బ్లూబెల్స్ పాఠశాలలో, రేకుర్తి విజన్ హైస్కూల్, తీగలగుట్టపల్లి మానేర్ హగ్స్ అండ్ హార్ట్స్ ఇంటర్నేషనల్ స్కూల్, బొమ్మకల్ బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్, నగునూర్ ఎస్పీఆర్ ఉన్నత పాఠశాలలో యోగా డే వేడుకలు నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన యోగా డే వేడుకల్లో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పాల్గొని యోగా సాధన చేశారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ)జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎనమల్ల నరేశ్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఐఎంఏ హాల్‌లో యోగా శిబిరం నిర్వహించారు. కరీంనగర్ మెడికవర్ హాస్పిటల్‌లో యోగా డే వేడుకల్లో యోగా గురువు ఆచార్య రామకృష్ణజీని మెడికవర్ వైద్యులు, సిబ్బంది సన్మానించారు. రామడుగు మండలం గోపాల్‌రావుపేట శ్రీ ప్రగతి హైస్కూల్‌లో చిన్నారులతో కలిసి కరస్పాండెంట్ రాధాకృష్ణ యోగాసనాలు వేశారు. గోపాల్‌రావుపేట ఉన్నత పాఠశాలలో యోగా దినోత్సవంలో ఎంఈవో అంబటి వేణుకుమార్ పాల్గొని యోగా ప్రాముఖ్యత వివరించారు.


నగరంలోని జ్యోతిరావు పూలే మైదానంలో యోగాసనాలు వేస్తున్న దేవనాథ రామానుజ జీయర్ స్వామి, శేఖర్‌రావు తదితరులు

### యోగాతో ఆరోగ్యం : సీపీ గౌస్ ఆలం

విద్యానగర్, జూన్ 21: యోగా ద్వారా మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం పొందవచ్చని, సంపూర్ణ ఆరోగ్యంతో ప్రశాంత జీవితాన్ని గడపవచ్చని కరీంనగర్ సీపీ గౌస్ ఆలం అన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో, ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ సహకారంతో కరీంనగర్ పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన కార్యక్రమానికి సీపీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యోగా ప్రాముఖ్యతను వివరించారు. అలాగే డ్రగ్ రహిత సమాజ నిర్మాణం కోసం పాటుపడతామని పోలీసు కమిషనర్‌తో పాటు యోగా కార్యక్రమంలో పాల్గొన్న అధికారులంతా ప్రతిజ్ఞ చేశారు.


పారమిత పాఠశాలలో యోగాసనాలు వేస్తున్న చైర్మన్, ఉపాధ్యాయులు



శాతవాహన యూనివర్సిటీలో యోగా డే వేడుకల్లో పాల్గొన్న వీసీ, రిజిస్ట్రార్ తదితరులు

## ఆటోలో దవాఖానకు వెళ్తూ..

- గుండెపోటుతో ఒకరి మృతి

మానకొండూర్ రూరల్, జూన్ 21: తల్లితో కలిసి దవాఖానకు ఆటోలో బయలుదేరిన వ్యక్తి గుండె పోటు రావడంతో అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. వివరాలు ఇవి.. మానకొండూర్ మండలం అన్నారం గ్రామానికి చెందిన మందల రామకృష్ణారెడ్డి (44)కి శుక్రవారం రాత్రి గుండెపోటు వచ్చింది. తర్వాత కొంత ఉపశమనం కలగడంతో తెల్లారి శనివారం తల్లి నీరజతో కలిసి అన్నారం నుంచి ఆటోలో కరీంనగర్ దవాఖానకు బయలుదేరాడు. సదాశివపల్లి సమీపంలోకి రాగానే రామకృష్ణారెడ్డికి మళ్లీ గుండెపోటు రాగా, ఆటోలో నుంచి కిందపడి అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఆటోలోనే వెనుకాల కూర్చున్న తల్లి సైతం తన వెంటనే ఉంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృత దేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. రామకృష్ణారెడ్డికి భార్య, కుమారుడు ఉన్నారు. కుటుంబంలో కలహాలు రావడంతో ప్రస్తుతం ఆయన తల్లితోనే జీవిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మానకొండూర్ సీఐ సంజీవ్ చెప్పారు.

## 25న జిల్లాస్థాయి ఎంపిక పోటీలు

కొత్తపల్లి, జూన్ 21 : రాష్ట్రంలోని మూడు క్రీడా పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి గానూ 4వ తరగతిలో ప్రవేశాల కోసం ఈనెల 25న జిల్లాస్థాయి ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు డీవైఎస్‌వో వి. శ్రీనివాస్‌గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులు ఈ నెల 25న ఉదయం 8 గంటలకు వయసు ధ్రువీకరణ పత్రం, 4వ తరగతి స్టడీ సర్టిఫికెట్, 3వ తరగతి ప్రోగ్రెస్ కార్డు, ఆధార్‌కార్డు, కులం సర్టిఫికెట్, 5 ఫొటోలతో అంబేద్కర్ స్టేడియంలో రిపోర్ట్ చేయాలని తెలిపారు.

## దరఖాస్తు గడువు పొడిగింపు

కరీంనగర్ రూరల్, జూన్ 21: నగునూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తు గడువు ఈ నెల 25 వరకు పొడిగించారని ప్రిన్సిపాల్ డాక్టర్ టి. మాలతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ పాసైన విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంపికైన విద్యార్థినులకు ఉచిత విద్య, వసతి, భోజనం అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

## డ్రగ్స్ రహిత జిల్లా కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలి

కొత్తపల్లి, జూన్ 21 : డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా యువజన, క్రీడా ప్రాధికార సంస్థ అధికారి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. నగరంలోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన నషా ముక్త్‌భారత్ అభియాన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మాదక ద్రవ్య రహిత క్రీడలు ఆడేలా భుజం తట్టాలన్నారు. అనంతరం మాదక ద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, ఇన్‌చార్జి డీఈవో అశోక్‌రెడ్డి, డీసీపీవో పరీన్, చైల్డ్ హెల్ప్ లైన్ జిల్లా కోఆర్డినేటర్ ఆవుల సంపత్ యాదవ్, కమ్యూనిటీ కోఎడ్యుకేటర్ మాలతి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కన్న కృష్ణ, బాలభవన్ సూపరింటెండెంట్ మంజుల, జిల్లా యోగా అసోసియేషన్ ప్రతినిధులు, జిల్లా ఒలింపిక్ సంఘం ప్రతినిధులు, ప్రాంతీయ క్రీడా పాఠశాల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రసమయికి సన్మానం

మానకొండూర్, జూన్ 21: అమెరికాతో పాటు ఇతర దేశాల్లో ఇటీవల నిర్వహించిన తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొని తిరిగి వచ్చిన మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌కు పలువురు అభినందనలు తెలిపారు. శనివారం మానకొండూర్ బీఆర్ఎస్ పార్టీ క్యాంపు కార్యాలయానికి వచ్చిన రసమయిని పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు శాలువాతో సన్మానించారు. ఇక్కడ మానకొండూర్, శంకరపట్నం మాజీ జడ్పీటీసీలు తాళ్లపెల్లి శేఖర్‌గౌడ్, లింగంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఎరుకల శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఉప సర్పంచ్ ఎనవేణి రాజు తదితరులు ఉన్నారు.


మానకొండూర్: మాజీ ఎమ్మెల్యే రసమయిని సన్మానిస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్

## ఇసుక ట్రాక్టర్లు అడ్డుకున్న రైతులు

చిగురుమామిడి, జూన్ 21: ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను రైతులు అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళ్తే మండలంలోని రామంచ మోయ తుమ్మెద వాగులో ఇసుకను ఇందిరమ్మ లబ్ధిదారులకు టోకెన్ ద్వారా ఒక్కొక్కరికి ఎనిమిది ట్రిప్పుల ఇసుక ఇస్తున్నారు. ఈ క్రమంలో వాగు పక్కనే ఉన్న తమ భూములు ఇసుక తవ్వకాలతో కోతకు గురవుతున్నాయని, ఇసుక తీయవద్దని దళిత రైతులు ట్రాక్టర్లను శనివారం అడ్డుకున్నారు. దీంతో రైతులకు ట్రాక్టర్ యజమానుల మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నది. సమాచారం తెలుసుకున్న తిమ్మాపూర్ సీఐ సదన్ కుమార్, తహసీల్దార్ రమేశ్, ఎస్ఐ శ్రీనివాస్ ఇరువర్గాలతో మాట్లాడారు. రైతుల భూముల పక్కన ఇసుక తీయకుండా చూస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. ఎవరైనా ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక తరలింపును అడ్డుకుంటే చర్యలు తప్పవని సీఐ సదన్ కుమార్ హెచ్చరించారు.

## రజక ఆత్మ గౌరవ సభ విజయవంతం చేయాలి

కరీంనగర్ రూరల్, జూన్ 21: రజక ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని తెలంగాణ రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూసాల సంపత్ పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని బహ్దూర్‌ఖాన్‌పేట సరస్వతీ నగర్‌లో జరిగిన తెలంగాణ రజక సంఘం గ్రామస్థాయి చైతన్య సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ నెల 25న కరీంనగర్‌లోని రెవెన్యూ గార్డెన్‌లో జరిగే రజక ఆత్మగౌరవ సభలో రజకులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సదస్సులో రాష్ట్ర కార్యదర్శి రాపాల శంకర్, రాచకొండ కొమురయ్య, నరేశ్, నేరెళ్ల లక్ష్మణ్, గంగిపెల్లి శ్రీనివాస్, మునిగంటి ఓదెలు, గుండేటి రాజు తదితరులు పాల్గొన్నారు.

## కాపర్‌వైర్ చోరీ

వీణవంక, జూన్ 21: బొంతుపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి గుర్తు తెలియని వ్యక్తులు కాపర్ వైర్‌ను దొంగిలించారు. శనివారం ఉదయం పంట పొలాల వద్దకు వెళ్లిన రైతులు ట్రాన్స్‌ఫార్మర్ కిందపడి ఉండడం గమనించి, పోలీసులకు సమాచారం అందించారు. రైతు కత్రవెళ్లి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిరుపతి పేర్కొన్నారు.

## 'అనుమతిలేని కళాశాలలపై చర్యలు తీసుకోవాలి'

కమాన్‌చౌరస్తా, జూన్ 21 : అనుమతి లేని ఇంటర్ కళాశాలలపై, అధిక ఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ కరీంనగర్ జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా ఇంటర్ విద్యాధికారి గంగాధర్‌కు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేశ్ మాట్లాడుతూ, అనుమతి లేని కళాశాలలపై చర్యలు తీసుకోకుండా, ప్రభుత్వ కళాశాలలు బలోపేతం చేయకుండా నిమ్మకు నీరెత్తినట్లు ప్రభుత్వం, అధికారులు వ్యవహరిస్తే దశలవారీగా ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు.

## ఉచిత వైద్య శిబిరానికి స్పందన

వీణవంక, జూన్ 21: బొంతుపల్లి గ్రామంలో శనివారం కరీంనగర్ మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. ఈ వైద్య శిబిరంలో 154 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి హాస్పిటల్ సెంటర్ గుర్రం కిరణ్ చెప్పారు. హాస్పిటల్‌లో 24 గంటలు సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులో ఉంటాయని గ్రామస్తులకు తెలిపారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ అధ్యక్షుడు పోలు ఐలయ్య, నాయకులు పోలు ఉస్మాన్, కొమురయ్య, కార్తీక్, హాస్పిటల్ మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్, శ్రీకాంత్, సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

LOST
తేది:29/04/2025, మంగళవారం రోజున లింగాపూర్ నుండి అంతర్గాంకి వెళ్తుండగా మార్గమధ్యంలో నాయొక్క బ్యాగ్, అందులోని పాస్‌పోర్ట్, సంతకం చేసిన 15 చెక్కులు (UBI) బాండ్ పేపర్స్ &ప్రామిసరి నోట్స్ పోయినవి. దొరికిన వారు సంప్ర॥ K.జగన్‌మోహన్‌రావు S/o. నారాయణరావు సెల్: 8374084369

FOR LEASE
★Available 2 Plots for Lease, 1000 Sq.yards each side by side East & West Facing at Garden Retreat - Mulugu 0.5 Km from Rajiv Rahadhari /Manchirial Highway for Godowns. Interested Contact: 9849014717.
NT-342982

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

## ఎన్నికల్లేవు.. ఇక అభివృద్ధిపైనే దృష్టి

- మానేరుపై గన్నేరువరం మండలానికి బ్రిడ్జి కోసం ప్రతిపాదనలు
- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

తిమ్మాపూర్, జూన్ 21: ప్రస్తుతం ఎన్నికలు ఏమీ లేవని, గ్రామాల అభివృద్ధి పైనే తమ దృష్టి ఉన్నదని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ స్పష్టం చేశారు. మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి తిమ్మాపూర్ మండలంలోని రామకృష్ణ కాలనీ గ్రామంలో రూ.75లక్షల ఈజీఎస్ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ.. మానకొండూరు నియోజకవర్గం అభివృద్ధికి తాను కృషి చేస్తానన్నారు. మానేరుపై గన్నేరువరం మండలానికి బ్రిడ్జి నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. ఎమ్మెల్యే సత్యనారాయణ మాట్లాడుతూ.. అభివృద్ధిలో అన్నదమ్ముల లాగా కలిసిమెలిసి ఉంటూ మండలాన్ని, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుంటానన్నారు. గన్నేరువరం ప్రజలు కరీంనగర్ రావడానికి ఇబ్బందులు పడుతున్నారని.. ఎల్ఎండీ రిజర్వాయర్ మానేరు వాగు పైన గన్నేరువరం మండలానికి బ్రిడ్జి నిర్మాణానికి రూ.100 కోట్లతో నిర్మించేందుకు ప్రయత్నిస్తున్న మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే గ్రామంలోని శ్రీ రామచంద్ర మిషన్ ఆశ్రమంలో యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మండలాధ్యక్షుడు జగదీశ్వరాచారి, నుస్తులాపూర్ సొసైటీ చైర్మన్ గుజ్జుల రవీందర్ రెడ్డి, నాయకులు గుజ్జుల ప్రణీత్ రెడ్డి, వేల్పుల ఓదయ్య, దావు సంపత్ రెడ్డి, అలువాల కుమార్, కాంగ్రెస్, బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

### చైతన్యపురిలో సీసీ రోడ్డు పనులకు కేంద్ర మంత్రి శ్రీకారం

విద్యానగర్, జూన్ 21: కరీంనగర్‌లోని చైతన్యపురి డివిజన్‌లో రూ.కోటీ 06 లక్షల రూపాయలతో సీసీ రోడ్డు పనులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా 57వ డివిజన్‌లోని విజేత సూపర్ మార్కెట్ వద్ద 45 లక్షల 20 వేల రూపాయల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. వీటితోపాటు చైతన్యపురిలోని బేతల్ చర్చి సమీపంలో రూ.28 లక్షల వ్యయంతో నిర్మించనున్న డ్రైనేజీ, సీసీ రోడ్ల పనులను, విజేత సూపర్ మార్కెట్ సమీపంలో 33 లక్షల 60 వేల రూపాయల వ్యయంతో చేపట్టిన ఆర్సీసీ శ్లాబ్ కల్వర్ట్, సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఆయా పనులన్నీ కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ జనరల్ ఫండ్స్ నిధులతో చేపడుతున్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల జియో ట్యాగింగ్ పూర్తి చేయాలి

కలెక్టరేట్, జూన్ 21: జిల్లాలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్లకు జియో ట్యాగింగ్ పూర్తి చేయాలని, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ గౌతం స్పష్టం చేశారు. ఇండ్ల గ్రౌండింగ్, జియో ట్యాగింగ్, పీఎంఏవై సైట్‌లో నమోదు, తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లు, హౌసింగ్ పీడీలతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అధికార వర్షాలు వచ్చేలోపు ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్, బేస్‌మెంట్ స్థాయిలో పూర్తి చేసేలా లబ్ధిదారులకు సూచించాలన్నారు. క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు ఎదురయ్యే సమస్యలు పరిష్కరించి ఇళ్ల నిర్మాణ ప్రక్రియలో వేగం పెంచాలన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన అర్బన్ సైట్‌లో ఇండ్లు మంజూరైన లబ్ధిదారుల వివరాలు, ఫొటో అప్లోడ్ చేయాలని సూచించారు. అన్ని ఇళ్లకు జియో ట్యాగింగ్ నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కరీంనగర్ కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, గృహ నిర్మాణ సంస్థ పీడీ గంగాధర్, ఏఈలు, మున్సిపల్ కమిషనర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


## సర్కారు బడిలో నీటిశుద్ధి యంత్రం ఏర్పాటుకు సహకారం

రామడుగు, జూన్ 21 : మండలంలోని గోపాల్‌రావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నీటిశుద్ధి యంత్రం ఏర్పాటు కోసం సదిశ ఫౌండేషన్ సభ్యులు శనివారం ఎంఈవో అంబటి వేణుకుమార్‌కు ఆర్థిక సాయం అందించారు. సర్కారు బడి చిన్నారులకు శుద్ధ జలాన్ని అందించేందుకు సహకరించిన సదిశ సేవాసంస్థకు ఎంఈవో ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం శైలజ, ఉపాధ్యాయులు, సదిశ స్వచ్ఛంద సేవాసంస్థ సభ్యులు ద్యావ నవీన్‌రెడ్డి, పున్న కనకయ్య, గంగినేని శ్రీనివాస్, వేముల కృష్ణ, రేణిగుంట శ్రీనివాస్, ఏపూరి ప్రశాంత్ పాల్గొన్నారు.

## కోర్టు డ్యూటీ అధికారులతో సీపీ సమీక్ష

హౌసింగ్‌బోర్డుకాలనీ, జూన్ 21: కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వివిధ కోర్టుల్లో కోర్టు డ్యూటీ అధికారులుగా విధులు నిర్వహిస్తున్న వారితో పోలీసు కమిషనర్ గౌస్ ఆలం శనివారం కమిషనరేట్ కేంద్రంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులపై సమగ్రంగా సమీక్షించారు. కేసుల్లో నిందితులకు శిక్ష పడే శాతాన్ని పెంచడంపై దృష్టి సారించాలని సూచించారు. అలాగే పెండింగ్ కేసుల సంఖ్యను తగ్గించాలన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ కేసులను వేగవంతంగా పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, సీసీఆర్బీ ఏసీపీ విజయ్ కుమార్, ఇన్‌స్పెక్టర్లు సరిలాల్, సంతోష్ కుమార్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అలరించిన సంగీత దినోత్సవం


పురస్కారాలు అందజేస్తున్న నరేందర్ రెడ్డి

కమాన్‌చౌరస్తా, జూన్ 21 : ప్రపంచ సంగీత దినోత్సవం సందర్భంగా ప్రవీణ్ సల్వాజి మ్యూజికల్ గ్రూప్, సల్వాజి ఈవెంట్స్, కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శనివారం కళాభారతిలో నిర్వహించిన వేడుకలు అలరించాయి. ఈ కార్యక్రమానికి ఆర్డీవో మహేశ్వర్ హాజరైన వేడుకలను ప్రారంభించారు. అనంతరం కళాకారులు పాడిన సినీ, జానపద, శాస్త్రీయ సంగీత పాటలు ఎంతగానో అలరించాయి. ఉమ్మడి పది జిల్లాలకు చెందిన 23 మంది కళాకారుల పేరిట 23 మంది వివిధ విభాగాలకు చెందిన కళాకారులకు స్మారక పురస్కారాలను సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, సినీ సంగీత దర్శకుడు గంటాడి కృష్ణ, సినీ గాయకుడు ప్రణయ్ కుమార్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో వంగ సుధాకర్, కట్ట మంజులాదేవి, లక్ష్మా రెడ్డి, రఘురాంగౌడ్, తిరుపతిగౌడ్, కాసు మధు, సంధ్య ఉమ్మడి 10 జిల్లాల నుంచి కళాకారులు, నగర వాసులు, కళాకారులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, జూన్ 21: విద్యుత్ తీగల కింద ఉన్న చెట్ల కొమ్మలు తొలగిస్తున్నందున ఆదివారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కరీంనగర్ రూరల్ ఏడీఈ రఘు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9నుంచి 12గంటల వరకు రేకుర్తి సమ్మక్క గద్దెలు, కంటి హాస్పిటల్ ఏరియా, బుడిగ జంగాల కాలనీ, ఇందిరమ్మ కాలనీలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

## ఇంటి కలను నిజం చేసుకోవాలి

తిమ్మాపూర్, జూన్ 21: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లు పథకంతో అర్హులందరూ తమ సొంతింటి కలను సాకారం చేసుకోవాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు. మండలంలోని నుస్తులాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ముగ్గు పోశారు. ఇల్లు రానివారు అసంతృప్తికి లోను కావద్దని, ఇది నిరంతర ప్రక్రియ అని, అందరికీ ఇండ్లు వస్తాయని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు బండారి రమేశ్, గ్రామ అధ్యక్షుడు చిరంజీవి, నాయకులు తుమ్మలపల్లి శ్రీనివాసరావు, కొత్త తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత.. కేసు నమోదు

తిమ్మాపూర్, జూన్ 21: మానకొండూర్ మండలం శ్రీనివాస్ నగర్ గ్రామంలోని వాగు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను తిమ్మాపూర్ గ్రామ శివారులో కాకతీయ కెనాల్ వద్ద ఎల్ఎండీ ఎస్ఐ శ్రీకాంత్ పట్టుకున్నారు. ట్రాక్టర్ డ్రైవర్ ఓర్సు విష్ణు, ఓనర్ సంపత్‌పై కేసు నమోదు చేశారు.

## వీధికుక్కల దాడిలో ఏడు మేకలు మృతి

హుజూరాబాద్ టౌన్, జూన్ 21: హుజూరాబాద్ మున్సిపల్ పరిధి ఇప్పలనర్సింగాపూర్ గ్రామంలో వీధికుక్కల దాడిలో ఏడు మేకలు మృతి చెందాయి. బాధితుడి కథనం ప్రకారం.. పుట్టపాక సమ్మయ్య తన గొర్రెల మందను మేపడానికి గ్రామ శివారుకు తీసుకెళ్లి తిరిగి వస్తుండగా వీధి కుక్కలు దాడి చేయడంతో ఏడు మేకలు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాయి. మరో 10 గొర్రెలకు గాయాలయ్యాయి. సుమారు రూ.80 వేల నష్టం జరిగినట్లు సమ్మయ్య తెలిపారు.

## జయశంకర్ సర్‌కు ఘన నివాళి

కలెక్టరేట్, జూన్ 21 : తెలంగాణ సిద్ధాంతకర్త, ఉద్యమ స్ఫూర్తి ప్రదాత ప్రొ.జయశంకర్ సర్ 14వ వర్ధంతిని శనివారం నగరంలోని మదీన చౌక్‌లో నిర్వహించారు. తెలంగాణ ఉద్యమ జేఏసీ ఆధ్వర్యంలో పలువురు ఉద్యమకారులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమ ఐక్యకార్యాచరణ సమితి జిల్లా అధ్యక్షురాలు ఎలుగు కవిత మాట్లాడుతూ, తెలంగాణ కోసం తన జీవితాన్నే త్యాగం చేసిన మహనీయుడు జయశంకర్ సర్ అని కొనియాడారు. తెలంగాణ రైతు సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో సర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమాల్లో టీయూ జేఏసీ ప్రధాన కార్యదర్శి హుసేనాబేగం, సహాయకార్యదర్శి అమరవాణి మమత, కార్యదర్శి రిజ్వానాబేగం, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణచౌక్, జూన్ 21: నగరంలోని జయశంకర్ సర్ విగ్రహానికి ప్రజా సంఘాల జేఏసీ జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ ప్రతి బిడ్డ సర్ ఆశయ సాధన కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హుజూరాబాద్ టౌన్, జూన్ 21: పట్టణంలోని పెన్షనర్ల భవనంలో రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు ప్రొఫెసర్ జయశంకర్ సర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, తెలంగాణకు ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ ఉస్మాన్ పాషా, అసోసియేషన్ సభ్యులు, పెన్షనర్లు పాల్గొన్నారు.

## పచ్చదనం, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

కార్పొరేషన్, జూన్ 21: నగరంలో పచ్చదనం, పారిశుధ్యంపై అధికారులు, సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టాలని నగర కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. శనివారం నగరంలోని పలు డివిజన్లలో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఎస్ఆర్ఆర్ కళాశాల రిజర్వాయర్ పరిధిలోని డీఆర్‌సీసీ కేంద్రాన్ని సందర్శించి డ్రై వేస్టు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, పారిశుధ్య విభాగం అధికారులు, సిబ్బంది నగరాన్ని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. డీఆర్‌సీసీకి ప్రతి స్వచ్ఛ ఆటో వచ్చేలా చూడాలని, ప్రతి రోజూ డీఆర్‌సీసీకి వచ్చే డ్రై వేస్టు వివరాల రిపోర్ట్ అందించాలని నిర్వాహకులను ఆదేశించారు. అలాగే నర్సరీల్లో మొక్కల సంరక్షణకు చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ స్వామి, పారిశుధ్య సిబ్బంది, నర్సరీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### నిబంధనల మేరకు నిర్మాణం చేపట్టాలి

నగరంలోని పద్మనగర్ జంక్షన్‌లో చేపడుతున్న ఐలాండ్ జంక్షన్ పనులను కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలతో జంక్షన్ సుందరీకరణ పనులను త్వరగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఈలు సంజీవ్‌కుమార్, యాదగిరి, డీఈలు లచ్చిరెడ్డి, అయూబ్ ఖాన్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

## నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

విద్యానగర్, జూన్ 21: లయన్స్ ఆఫ్ కరీంనగర్ గోల్డెన్ శాతవాహన 2025-2026 సంవత్సరానికి గానూ నూతన కార్యావర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యవర్గ ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి 320జీ సెకండ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ మోర భద్రేశం ముఖ్య అతిథిగా హాజరై, ఇన్‌స్టలేషన్ అధికారిగా వ్యవహరించారు. నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన అధ్యక్షుడిగా లయన్ ననువాల గిరిధర్ రావు, కార్యదర్శిగా లయన్ పాశం నర్సింహారెడ్డి, కోశాధికారిగా లయన్ డాక్టర్ కుంభోజు రమేశ్, ఫస్ట్ వైస్ ప్రెసిడెంట్ గా లయన్ చిలుపూరి రాములు, సెకండ్ వైస్ ప్రెసిడెంట్‌గా లయన్ మమత వేణు, క్లబ్ డైరెక్టర్లు, సభ్యులు ఎన్నికై ప్రమాణ స్వీకారం చేశారు. ఇమ్మీడియేట్ పాస్ట్ ప్రెసిడెంట్ లయన్ మానువాడ శంకర్, పాస్ట్ ప్రెసిడెంట్ లయన్ అక్కినపల్లి అజయ్ కుమార్, డిస్ట్రిక్ట్ కాబినెట్ ట్రెజరర్ లయన్ గాలిపెల్లి వెంకట్, జోన్ చైర్‌పర్సన్ లయన్ శశికాంత్ వర్మ, మీల్స్ ఆన్ వీల్స్ జిల్లా కో ఆర్డినేటర్ లయన్ రావికంటి కృష్ణ కిశోర్, లయన్ పురుషోత్తం సతీశ్, లయన్ బండారి గంగాధర్, లయన్ ఆరెపల్లి సంపత్, లయన్ అలిశెట్టి శ్రీనివాస్, లయన్ ఉదారపు వెంకటస్వామి, లయన్ శ్రీరామోజు దేవేందర్, లయన్ సైండ్ల బాలయ్య, లయన్ ననువాల హరిప్రియ, లయన్ మానువాడ వనజ, లయన్ అక్కినపల్లి లక్ష్మి, లయన్ కుంభోజు సమత, లయన్ పాశం సత్య, లయన్ చిలుపూరి జ్యోతి, లయన్ సభ్యులు పాల్గొన్నారు.